విశాలాంధ్ర కృష్ణా జిల్లా

అటకెక్కిన సీఎం హామీ!

గ్రామస్తుల సహకారంతో వంతెన తాటి పట్టెల వంతెన

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత సంవత్సరం అక్టోబర్ 20వ తేదిన అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రి కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఎడ్లంక కృష్ణానదీపాయపై వంతెన నిర్మాణానికి రూ.8.5 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు బహిరంగ ప్రకటన చేశారు. ఆచరనలో నేటికి వంతెన నిర్మాణ పనులు నోచుకోలేదు. హామీ ఇచ్చినదే మొదలు గ్రామస్థులంతా అవనిగడ్డ వరకు భారీ ర్యాలీతో వచ్చి నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రప టానికి పాలాభిషేకాలు, మిఠాయిలు పంచుకుని ఆనంద డోళికలలో మునిగి తేలారు. ఎడ్లంక ప్రజల పరిస్థితి యాదా రాజా తదాప్రజాగా కోనసాగుతున్న దీనపరిస్థితి. గత నెలలో వచ్చిన వరదలకు కృష్ణానదీలో రహదారి కొట్టుకుపోవడంతో ఎడ్లంక గ్రామస్థులకు రహదారి కష్టాలు ప్రారంభమైనాయి. సీఎం స్వయంగా ఇచ్చిన హామీపై నేటి వరకు స్పష్టత లేకపోవడంతో గ్రామస్థులంతా ఏకమై స్వచ్ఛందంగా తమ కష్టాలకు తామే భాధ్యత వహిస్తూ మరో సారి తాటి పట్టెల వంతెన నిర్మాణంపై దృష్టి సారించి గత మూడు రోజులుగా తాటి చెట్లను నరకడం వాటిని బద్దలుగా చీల్చడం వంటి కార్యక్రమాల్లో మునిగి తేలుతున్నారు. గురువారం వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. మూడు సంవత్సరాలుగా గ్రామస్థులు మోరపెట్టుకుంటుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి రూ.8.5 కోట్ల వ్యయంతో నదీపై బ్రిడ్జి నిర్మాణం చేస్తానని బూటకపు హామీ ఇచ్చారని అది నమ్మిన ప్రజలు పాలాభిషేకాలు చేసారు. మరో 50 రోజుల్లో సంవత్సరం పూర్తి కావస్తున్న కనీసం పరిశీలకులు కూడా వచ్చి చూసిన పరిస్థితి కూడా లేదని 2024 ఎన్నికలు గడిస్తే తమను పట్టించుకునే నాదుడు కూడా ఉండడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2 లక్షల క్యూసెక్ల వరద నీటిని ఇరిగేషన్ అధికారులు ఆలోచన లేకుండా సముద్రానికి వదిలి మా గ్రామానికి తాత్కాలికంగా వేసుకున్న రహదారి గట్టును తెగేలా చేశారని ఆవేదనలో గ్రామస్థులు ఉన్నారు. అధికారులు వరద వస్తే పడవ వేస్తారని తరువాత మా చావుకు మమ్మల్ని వదిలేస్తారని తిట్టు పురాణం సాగిస్తున్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణానికి గ్రామస్థులు దోవా గోవర్ధన పాలేపు వెంకటేశ్వరరావు, బాబురావు, నీలా చింటు, దోవా ముని మధు, వాసు, దోవా లక్ష్మణ, దోవారి బుజ్జి, సముద్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గోని వంతెన నిర్మాణం చేసుకుంటున్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేసినందుకు కృష్ణాజిల్లా ప్రజలు కార్మికులకు ఉద్యోగస్తులకు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి తరపున సీపీఐ జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి టి.తాతయ్య ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జిల్లాకు చెందిన పార్టీ శ్రేణులు బస్సుయాత్రకు స్వాగతం పలకటం నుంచి మచిలీపట్నంలో రౌండ్‌టేబుల్ సమావేశం, చల్లపల్లిలో బహిరంగ సభను విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలను మేల్కొల్పటానికి కమ్యూనిస్టు పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు.

నేడు శ్రీకాకుళంలో ఇసుక అధిక ధరలపై నిరసన

విశాలాంధ్ర-ఘంటసాల: మండల పరిధిలోని శ్రీకాకుళంలో ఇసుక అధిక ధరలను నియంత్రించాలని సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు పేర్కొన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం గ్రామంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను, స్టాక్ నిల్వలను పరిశీలించి అక్రమ తవ్వకాలు, ఇసుక అధిక ధరలకు విక్రయాలకు నిరసనగా నిరసన చేస్తారన్నారు.

గన్నవరం ఎయిర్‌పోర్టులో కేంద్రహోం మంత్రి అమిత్‌షాకి ఘన స్వాగతం

విశాలాంధ్ర-గన్నవరం : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలంగాణ పర్యటనకై ఆదివారం మధ్యాహ్నం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కేంద్ర హోంమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. గుంటూరు ఐజి జి.పాలరాజు, కృష్ణా జిల్లా ఎస్పీ పి జాషువా, విమానాశ్రయ ఇన్‌ఛార్జి డైరెక్టర్ పి.వి.రామారావు తదితరులు కేంద్ర హోంమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం కేంద్ర హోం మంత్రి బిఎస్ఎఫ్ హెలికాప్టర్‌లో ఖమ్మం బయలుదేరి వెళ్లారు.

మందుల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో ఆదివారం పెనుమోతు వంశీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పెనుమోతు శ్రీనివాసరావు వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు ఉచితంగా రక్త పరీక్షలను డా.జాగేశ్వరరావు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎన్‌టిఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు, అర్జా ప్రసాద్, పొన్నూరు సత్యనారాయణ, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, చింతా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు మండలి వెంకట్రామ్ సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవనిగడ్డ భారతి హాస్పిటల్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సహాయం అందించారు. బాధిత కుటుంబాలను వెంకట్రామ్ పరామర్శించి ప్రమాద కారణాలు అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాద బాధితులు కేసన కృష్ణకుమారి, సూరగం నాగమల్లీశ్వరిలకు ఆర్థిక సాయం, దుస్తులు అందించారు. ఆయన వెంట చెన్ను గాంధీ, మండలి రామ్మోహన్‌రావు, చెన్ను బాబురావు, మండలి బలరాం, చెన్ను బుల్లియ్య తదితరులు ఉన్నారు.

లౌకిక వాదానికి పెనుముప్పుగా విద్వేషపూరిత రాజకీయాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: నేడు భారతదేశ లౌకికవాదానికి పెనుముప్పుగా విద్వేషపూరిత రాజకీయాలు తయారయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులలో భాగంగా అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన భారత లౌకిక రాజ్యాంగంపై మతోన్మాదుల దాడి పర్యవసనాలు పరిష్కారాలు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు చీలికలు తెచ్చే విధంగా మతోన్మాదం పనిచేస్తుందన్నారు. దీని ద్వారా ప్రపంచ దేశాలలో భారత దేశ ప్రతిష్టను దిగజార్చే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. 70 సంవత్సరాల తరువాత మోడీ నాయకత్వాన భారతదేశంలో అధికారం చేపట్టిన బీజేపీ విభిన్న సంస్కృతులు మతాలు రాజకీయ పార్టీల ద్వారా లౌకిక రాజ్యంగా కొనసాగుతున్న భారతదేశాన్ని బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై మధు ఘంటసాల మండల పార్టీ కార్యదర్శి వాక రామచంద్రరావు మోపిదేవి మండల పార్టీ కార్యదర్శి బండి ఆదిశేషు కోడూరు మండల పార్టీ కార్యదర్శి పోలావత్తిన మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మనువాద విధానాలను వ్యతిరేకించండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్. విశ్వహిందూ పరిషత్ వంటి మతతత్వ సంస్థల అదేశాలను తుచా తప్పకుండా బిజెపి పార్టీ అనుసరిస్తున్న మనువాదాన్ని ఫాసిస్టు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఎంసిపిఐ(యు) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.ఖాదర్ బాషా పిలుపునిచ్చారు. అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ బిజెపి నాశనం చేస్తుందన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంస్థలన్నిటిని ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. రైతులకు విత్తనాలు, పురుగుమందులు ఇవ్వకుండా ఇవ్వకుండా పండించిన ధాన్యం గిట్టుబాటు ధరలు లేక ప్రభుత్వం దోపిడీ చేస్తుందన్నారు.పారిశ్రామిక అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రరణ చేసి అత్యాచార చేసి దాడులు చేసి చంపేస్తున్నారన్నారు. బిజెపి ముస్లిం,క్రిస్టియన్స్ పైన దాడులు చేస్తున్నారన్నారు. ఇటువంటి మానువాదాన్ని తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు.రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తుమాటి శివయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల ఎన్నో సం..రాలు పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 కోడ్‌గా కుదించి కార్మికులకు నష్టం కలిగించే పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకి లాభం చేకుర్చే విధంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. రైతులు 3 నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం ఫలితంగానే రద్దు చేశారని అయితే ఆ సమయంలో ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. దాంతో మరల రైతాంగం మరో ఉద్యమానికి సమాయత్తం అవుతుందని దీనిలో ప్రతి ఒక్కరు పాల్గొని మోడీకి గుణపాఠం చేప్పాలని పిపలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా కార్యదర్శి సయ్యద్ సలీం, మొహిద్దిన్, నాగలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నగరంలో 'మిస్టర్ పోలిశెట్టి' సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : విజయవాడ నగరంలో హీరో నవీన్ పోలిశెట్టి హీరోయిన్ అనుష్క జంటగా నటించిన మిస్టర్ పోలిశెట్టి చిత్రం యూనిట్ సందడి చేసింది. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆ చిత్రం ప్రమోషన్ లో భాగంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆచిత్ర హీరో నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూమిస్టర్ పోలిశెట్టి చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరం తో తనకెంతో అనుబంధం ఉందన్నారు.చదువుకున్న రోజుల్లో విజయవాడలోనే ఎక్కువగా ఉండేవాడిననీ పేర్కొన్నారు.మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి చిత్రం కు సంబంధించిన టీజర్ ట్రైలర్ కు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందనీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 7న సినిమాను రిలీజ్ చేయనున్నామని తెలిపారు.త్వరలో రెండు చిత్రాలలో నటించనున్నాననీ, ప్రేక్షకులందరూ కచ్చితంగా థియేటర్లోనే సినిమా చూడాలి పైరసీని ప్రోత్సహించవద్దనీ కోరారు.తెలుగు, తమిళం,మలయాళం కన్నడ భాషలలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నామనీ తెలిపారు.

పెన్షన్ దరఖాస్తులు తనిఖీకే పరిమితం?

అయోమయంలో దరఖాస్తుదారులు

దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

విశాలాంధ్ర-కూచిపూడి : డాక్టర్ వైయస్సార్ ఫెంక్షన్ కానుక దరఖాస్తులు ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ కే పరిమతమవుతున్నాయని దరఖాస్తు దాఖలు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. జూన్ నెల నుంచి కొత్త పెన్షన్లు ఈ నెలలో వస్తాయి... ఇదిగో ఈ నెలలో వస్తాయంటూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు రెండు నెలలుగా ఊరించడానికే అలవాటు పడ్డారు కాని స్పష్టంగా ఎప్పుడు వస్తాయో చెప్పలేకపోతున్నారనే ఆవేదనను పింఛను కోసం నిరీక్షిస్తున్న అర్జీదారులువ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి తర్వాత పింఛను కోసం దాఖలు చేసుకున్న అర్జీలలో మే 31 వ తారీకు లోపుగా వచ్చిన అప్లికేషన్లను పరిశీలించి వాటిల్లో 50 జీతానికి పైగా మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయంటూ అధికార వర్గాల సమాచారం.! అంతేకాకుండా పింఛన్లపైనే మరో ప్రచారం కూడా వినబడుతోంది . ఇటీవలజరిగిన జగనన్న సురక్ష, ప్రతి సోమవారంజరుగుతున్న స్పందన కార్యక్రమాలలో డాక్టర్ వైయస్సార్ పెన్షన్ కానుక కోసం దరఖాస్తులు దాఖలు చేస్తున్న అప్లికేషన్స్ మొవ్వ ఎండిఓ కార్యాలయంలో ఎంపీడీవో జి సుధాప్రవీణ్ పరిశీలించారు. ఆ సమయంలో మండలంలోని 16 సచివాలయాలలో 166 మంది చేస్తున్న అప్లికేషన్స్ అందరూస్పష్టమైన సమాచారాలతోనే అందజేశాంన్నది అధికార వర్గాల తాజాసమాచారం. మరి ఈ మండలంలో ఇప్పటివరకుపంపిణీ చేయాల్సిన సుమారు 500కు పైగా ఫెన్షన్స్ కోసం ఎంపికైన అర్హులు ఎదురుచూపులో ఉన్నారు. దీనిపై అటు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గాని ఆయా వాలంటీర్లు గాని స్పష్టమైన సమాచారం ఇవ్వలేకపోవడం తో అర్జీదారులు పింఛనుపంపిణీపై తమ అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎం పి.డి.వో జి సుధాప్రవీణ్.ను సంప్రదించగా సెప్టెంబర్ నెలలో కొత్త పెన్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

మైనార్టీ హక్కుల సమావేశం

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణంలోని మైనార్టీ హక్కుల వేదిక కార్యాలయంలో ఆదివారం పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ హక్కుల వేదిక అధ్యక్షులు ఎండి సిద్ధిక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం కేంద్ర మైనార్టీ సంక్షేమ శాఖ వారిచే మైనార్టీ విద్యార్థులకు అందించే ఎన్.యస్.పి సెంట్రల్ మైనార్టీ ప్రీ మెట్రిక్ అండ్ పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్‌షిప్‌లు 2022-23వ సంవత్సరానికి ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులు ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు గతంలో ఇచ్చేవారు కానీ 2022-23వ సంవత్సరంలో ఒకటో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆన్‌లైన్ చేయించుకున్న తరువాత క్యాన్సల్ చేశారు. తొమ్మిదో తరగతి నుండి డిగ్రీ వరకు చదివే విద్యార్థులకు గత సంవత్సరం రావాల్సిన స్కాలర్షిప్ డబ్బులు విద్యార్థుల ఖాతాలలో 2023వ సంవత్సరం జనవరి నెలలో పడాల్సిన డబ్బులు ఇంతవరకు పడలేదు ఈ సంవత్సరం కొత్తగా ఆన్లైన్ చేయించుకునే సమయం మొదలైనప్పటికీ కొత్తగా ఉన్నత ప్రధానోపాధ్యాయులు బయోమెట్రిక్ వేసిన తరువాత విద్యార్థులు బయోమెట్రిక్ వేయాలని కొత్తగా నిబంధన పెట్టడం వలన ఇంతవరకు విద్యార్థుల అకౌంట్లో డబ్బులు పడలేదు దీనిపై కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి మరియు మండల విద్యాశాఖ అధికా కార్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్కాలర్షిప్పులపై అవగాహన కల్పించవలసిందిగా పత్రికా ముఖంగా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి సిద్ధిక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ వి అప్పారావు మైనార్టీ నాయకులు ఎండి ఇలియాస్ అబ్దుల్ హఫీజ్ ఎండి పాషి షేక్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థల్ని విచ్ఛిన్నం చేస్తున్న జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ వ్యవస్థల్ని విచ్ఛిన్నం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమ పథకాలను రద్దు చేసినటువంటి ప్రభుత్వం దేశంలో మరో రాష్ట్ర ప్రభుత్వం లేదని ఇండియన్ లేబర్ పార్టీ (అంబేద్కర్ - పులే) రాష్ట్ర అధ్యక్షులు,హైకోర్టు న్యాయవాది గుర్రం రామారావు అగ్రహం వ్యక్తం చేశారు. అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ సమావేశం నిర్వహించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ని హైకోర్టు కొనసాగించాలని తీర్పు ఇస్తే కూడా పట్టించుకోలేదంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఏదన్నా ఉంటుందా అని ప్రశ్నించారు. రాజ్యాంగ ప్రకారం విద్యను ఉచితంగా ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటే పిజీ వాళ్ళకి స్కాలర్‌షిప్ రద్దు చేయడమే కాకుండా కొత్తగా వచ్చిన మెడికల్ సీట్లని అమ్ముకుంటున్నారన్నారు.మెడికల్ సీట్లోలో రిజర్వేషన్లు, ఉద్యోగ ప్రమోషన్‌లో రిజర్వేషన్ అమలు పరచాల్సిందే,బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కంటిన్యూ చేయాల్సిందే అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకానికి రుణాలు ఇవ్వాలన్నారు.తక్షణం స్పందించి వాటిని పునరుద్ధరించకుంటే మరో ఆరు నెలల్లో ప్రజలు జగన్‌ను ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి తమ పార్టీ ప్రణాళికను ప్రజలకు వివరించటం జరుగుతుందన్నారు.2024 ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేస్తామన్నారు.ఈ సమావేశంలో.డాక్టర్ మద్దు అంకయ్య,జాతీయ అధ్యక్షులు గంగోలు తేజ,కోరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్ కేపీ వీవీ హిందూ హైస్కూల్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ స్టేట్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : హాకీ విజార్డ్ ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యా శాఖ 2023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను (క్రీడా ప్రతిభా అవార్డులు) ప్రకటించింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న నిర్వహిస్తారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను పాఠశాల విద్యా కమిషనర్ (సీఎస్ఈ) ఎస్ సురేష్ కుమార్ ఆదివారం ఇక్కడ విడుదల చేశారు.విజయవాడలోని కొత్తపేటలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి, విస్సంశెట్టి వెంకటరత్నం (ఎస్ కే పి వివి) హిందూ హైస్కూల్ 2023-24 సంవత్సరానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును గెలుచుకుంది. ఎస్ కేపీవివి హిందూ ఉన్నత పాఠశాల మొత్తం 34 పతకాలను గెలుచుకుంది. 130 మంది విద్యార్థులు వివిధ క్రీడా విభాగాలలో పాల్గొని 636 పాయింట్లు సాధించారు. అలాగే కడప నగరపాలక సంస్థ (మెయిన్) పాఠశాల (594 పాయింట్లు) ద్వితీయ స్థానంలో నిలవగా, పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఏఎంజీ ఉన్నత పాఠశాల (496 పాయింట్లు) తృతీయ స్థానంలో నిలిచింది. ఆగస్టు 29న 130 స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సిఎస్ఇ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో స్థానిక అధికారుల సమక్షంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించి వారికి విశిష్ట 'క్రీడా ప్రతిభా అవార్డులను అందజేయాలని అన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు జిల్లా స్థాయిలో ఈ అవార్డులను అందజేస్తారని, మొదటిసారిగా రాష్ట్ర స్థాయి అవార్డులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-ఘంటసాల : ఘంటసాల మండలం కొడాలి కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ పరుచూరి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కోపరేటివ్ బ్యాంకు ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రేలంగి శిరీష పాల్గొని సొసైటీ సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 130 మందికి కళ్ళజోళ్లను కోపరేటివ్ బ్యాంకు సహకారంతో ఉచితంగా అందించగా, ఆరుగురు వ్యక్తులను కంటి ఆపరేషన్ ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఘంటసాల ఎఎంసి ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, కొత్తపల్లి పిఏసీఎస్ ఛైర్మన్ తాతినేని కృష్ణారావు, వైసీపీనేత పడమట వీర కుమార్, కొడాలి పిఏసీఎస్ సెక్రటరీ తుమ్మల ఆదినారాయణ, పిఆర్వో గణేష్, ఏఎన్ఎమ్ చిత్ర, పిఏసీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపూడి యూనియన్ బ్యాంకులో మూడు రోజులు ప్రత్యేక బంగారు రుణ పథకం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదపూడి యూనియన్ బ్యాంక్ లో మూడు రోజులు పాటు నిర్వహించే ప్రత్యేక బంగారు రుణ పథకం సోమవారం నుంచి ప్రారంభం చేస్తారు. ఈ మేరకు ఆ బ్రాంచ్ మేనేజర్ శ్రావణి, జ్యూయల్ అప్రైజర్ మధుసూదన రావు కరపత్రాలు ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఒక గ్రాము బంగారం అత్యధికంగా రూ. 4,350 కొరకు రుణం ఇస్తారన్నారు.

ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న కాలుష్యం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : నేటి ఆధునిక జీవన విధానంలో వాహనాల వినియోగం పెరిగి కాలుష్యం అధికమౌతుందని ఎస్ఎన్జీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శారదా వాణి ఆవేదన వ్యక్తంచేసారు. అందుకే ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి వాటిని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. ద నేచర్ బై గ్రోవింగ్ ట్రీస్ సంస్థ స్థాపించి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవాడ ఫన్ టైమ్ క్లబ్ లో నిర్వహించారు. మదర్ థెరిస్సా జయంతి పురస్కరించుకుని ప్రత్యేక నివాళులు అర్పించి మొక్కలు పంపిణీ చేసారు. అనంతరం టెర్రాస్ గార్డెన్ చేస్తున్న వారికి అవార్డులు అందజేసారు. అనంతరం శారదా దేవీ మాట్లాడుతూ పోల్యూషన్ పెరిగిపోతున్న నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు.

'గంగానమ్మ' సందడి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గంగానమ్మ సంబరాలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు, కొలుపులు, పూజలు, మొక్కుబడులు నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగానే పెదపూడి గ్రామంలోని గంగానమ్మరాయి వద్ద అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా కూచిపూడి పెదపూడి గ్రామంలో ప్రధాన రహదారిలో నిర్వహించారు. ఈ సమయంలో డప్పు కళాకారులు ఈలలు కేరింతలు నడుమ నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి అలాగే మండలంలోని మొవ్వ గ్రామంలో మండవ వారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న గంగానమ్మ దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

దా అల్లి కాఫీ & రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన దా అల్లి కాఫీ అండ్ రెస్టారెంట్ ను వైయస్సార్ ఛారిటీస్ అధినేత యలమంచిలి జయప్రకాశ్, అరుణ దంపతులు, ఆంధ్ర హస్పటల్ ఎండి రమణమూర్తి, తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్ , డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, వైఎస్సాఆర్ సిపి సీనియర్ నాయకులు కడియాల బుజ్జిబాబు, మాజీ డిప్యూటీ మేయర్ అల్లా చెల్లారావు పలువురు ప్రముఖులు కలిసి రెస్టారెంటును లాంఛనంగా ప్రారంభించారు. సేవా , రాజకీయా కార్యక్రమాలతో ప్రజలు మన్నలు పొందిన యలమంచిలి జయప్రకాశ్ నూతన రెస్టారెంట్ మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు దేవినేని అవినాష్ తెలిపారు. మంచి అహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన రెస్టారెంట్ నగరవాసుల నుంచి మంచి అదరణ లభిస్తోందని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అశాభావం వ్యక్తం చేశారు.. సరసమైన ధరల్లో సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి అహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన కాఫీ, బిర్యానీ , చైనీస్ , తందూరి లాంటి వైరటీ వంటకాలు భుజించి చక్కటి అనుభూతిని పొందేవిధంగా రెస్టారెంట్ వైఎస్సార్ ఛారిటీస్ అధినేత అల్లి రెస్టారెంట్ యాజమాని యలమంచిలి జయప్రకాశ్ తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడిన పాడి గేదె

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలోని కడవకొల్లు మురళి కి చెందిన పాడి గేద ఆదివారం పాత సెప్టిక్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తు పడి ఇరుక్కుపోయింది. ఈ సమాచారాన్ని బాధిత కుటుంబ సభ్యులు హుటాహుటిన మొవ్వ అగ్నిమాపక కేంద్రానికి తెలిపారు. ఫైర్ అధికారి కే వెంకటేశ్వర రావుఆధ్వర్యంలో సిబ్బంది స్థానికుల సహకారంతో పాడి గేదని పైకి తీసి రక్షించారు. ఆ పాడి గేదె విలువరూ.70 వేలని అధికారులు తెలిపారు. తమ పాడి గేదెను సురక్షితంగా రక్షించిన అగ్నిమాపక సిబ్బందికి సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టెంబర్ 30న విజయవాడలో సినీ అవార్డ్స్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న సినీ అవార్డులు అందజేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు అంబటి మధుమోహన్ కృష్ణ తెలిపారు.అదివారం గాంధీనగర్లఓని హోటల్ ఐలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సినీ రంగానికి కేంద్ర బిందువైన విజయవాడలో అవార్డులు అందజేయడం చాలా అభినందనీయమని తెలిపారు. తమ అసోసియేషన్ ప్రధాన ఉద్దేశం సినీ రంగంలో ఉన్న 24 కళల్లో పని చేసే కార్మికుల సంక్షేమమే ధ్యేయమని వెల్లడించారు. దీనికి సంబంధించి జ్యూరి,న్యాయ నిర్ణేతల కమిటీ నియమించినట్లు తెలిపారు.సినీ రంగానికి సంబంధించిన వారు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఫిల్మ్ అసోసియేషన్ సభ్యులందరూ కూడా షార్ట్ ఫిలిమ్స్, ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, మ్యూజిక్ వీడియో, సబ్మిట్ చేయాలని కోరారు.ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ దాదాపు 24 రాష్ట్రాల్లో ఉందని అన్నారు.అతి పెద్ద సామూహిక సంస్థ ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ అని తెలిపారు.

వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు తెలపాలి

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం భారత చైతన్య యువజన పార్టీ సోషల్ మీడియా విభాగం సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రానికి చెందిన వారి జిల్లాల నుంచి సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశం ఉద్దేశించి సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్ మచ్చ కోటేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామ చంద్ర యాదవ్ ఆదేశాల ప్రకారము రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సోషల్ మీడియా విభాగంకమిటీలను నియమించను న్నట్లు తెలిపారు. ఈ కమిటీ తమ పార్టీ విధివిధానాలను సిద్ధాంతాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యం నింపడమే తమ ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. తదనంతరం సోషల్ మీడియా విభాగం ప్రతినిధి శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాలన నచ్చక చాలామంది ఆ పార్టీని వెళుతున్నారని, ఇందులో భాగంగా తాను కూడా వైసిపి పార్టీ నుంచి బయటికి వచ్చి శ్రీరామచంద్రయ్య పెట్టిన భారత చైతన్య యువజన పార్టీలో చేరినట్లు తెలిపారు. బిసివై పార్టీ సిద్ధాంతాలకు లోబడి పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు మద్దెల ఏడుకొండలు రెడ్డి, అయ్యన్న, గుమ్మా రాజు, పసుపులేటి లలిత, మల్లికార్జున, వెంకటరమణ, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : ప్రపంచ దేశాలు, మేధావులు కొనియాడుతున్న అత్యంత స్ఫూర్తిదాయమైన మన భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నందున రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం ఉద్యమాలు అనివార్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అన్నారు. ఈ నెల 24వ తేదీన రెడ్డిగూడెం మండలం శాయన్నపాలెంలో జరిగిన సీపీఐ బస్సుయాత్ర ఘనంగా, జయప్రదంగా నిర్వహించినందుకు సీపీఐ రెడ్డిగూడెం మండలం సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ, ప్రజాసంఘాలు ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచినట్లు ప్రతిపౌరునికి జీవించే హక్కు మనిషి మనిషిగా మనుగడు సాగించేందులకు కల్పించిన హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్మిక, కర్షక, శ్రామిక మహిళా, యువజన, విద్యార్థి, ఉద్యోగ వర్గాల, పీడిత దాడిత అణగారిన బడుగు వర్గాల అభ్యున్నతి కోసం హక్కుల కోసం సక్రమంగా అమలు జరిపించు కోవడం మన బాధ్యత అన్నారు. దీనికి ఉద్యమాల చరిత్ర మనకు రుజువు చేస్తుందని గుర్తు చేశారు. దేశాన్ని కాపాడు కుందాం, రాష్ట్రాన్ని రక్షించుకుందామనే వర్తమాన రాజకీయ లక్ష్యంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ నాయకత్వాన రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17వ తేదీన నుంచి సెప్టెంబర్ 8వ తేదీన వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీపీఐ బస్సు యాత్ర ఈనెల 24న ఎన్టీఆర్ జిల్లాలో రెడ్డిగూడెంలో ప్రవేశించినప్పటి నుంచి విజయవాడలో ముగిసే వరకు దిగ్విజయంగా సాగిందన్నారు. ఈ యాత్ర జయప్రదానికి కృషి చేసిన జిల్లా, నగర, నియోజకవర్గ, మండల, డివిజన్, గ్రామస్థాయి, నాయకులకు పార్టీ ప్రజా సంఘాల శ్రేణులందరికి సీపీఐ జిల్లా సమితి తరపున ఈ సందర్భంగా విప్లవాభినందనలు తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

సీపీఐ అనుముల్లంక గ్రామశాఖ ఏర్పాటు

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలంలోని అనుముల్లంక గ్రామంలో ఆదివారం ఎం ఏసోబు అధ్యక్షతన సీపీఐ గ్రామశాఖ సమావేశం సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగుల్‌మీరా మాట్లాడుతూ 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని.. దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి పేదలకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు మాట్లాడుతూ మండలంలో కొత్త శాఖలు ఏర్పాటు చేయటం సంతోషమని అన్ని గ్రామాల్లో పార్టీని అభివృద్ధి చేయాలని కోరారు. మండల సహాయ కార్యదర్శి గౌరాజ్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామశాఖ లేని గ్రామాల్లో గ్రామ శాఖలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ శాఖ ఏర్పాటుకు కృషి చేసిన అనుముల్లంక గ్రామానికి చెందిన బట్టగాని పూర్ణయ్యను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ చారి, వేల్పుల. జమలమ్మ, బట్ట గాని కమల, పరిసపోగు ప్రభాకర్, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలి

పాలక మండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దుర్గగుడి మహామండపంలోని అన్నదానం విభాగంలో ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు ఆదివారం పరిశీలించారు. మహామండపం 2వ అంతస్తు లోని అన్నదానం హాలులో అన్నప్రసాదములోని వంటకములను పరిశీలించారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులతో మాట్లాడి పదార్థాల రుచి, తదితరములు అడిగి తెలుసుకునగా భక్తులు సంతృప్తి ని వ్యక్తం చేశారు. భక్తులందరూ అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించే విధముగా చూడాలని, అన్నప్రసాదం మరింత రుచిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహా మండపంలోని 2,3 అంతస్తులలో క్యూ లైన్లు ఇతర ప్రదేశములు పరిశీలించి శానిటేషన్ విభాగం వారు ఈ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

అమ్మవారిని సన్నిధిలో పొలిశెట్టి నవీన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రి అమ్మవారిని సినీ నటుడు పొలిశెట్టి నవీన్ ఆదివారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనలు తీసుకున్నారు. అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. తన ప్రతి చిత్రం విడుదలకు ముందు అమ్మవారిని దర్శించుకోవటం అలవాటన్నారు. సెప్టెంబర్ 7వతేదీన మిస్‌శెట్టి,మిస్టర్ పొలిశెట్టి చిత్రం విడుదల అవుతుందన్నారు. ఈ చిత్రంలో అనూష్క నటీగా నటించారన్నారు. జాతిరత్నాలు చిత్రం ఎంత వినోదం పండించిందో అంతే కంటే ఎక్కువ ఈ చిత్రంలో వినోదం ఉందన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల ఆశీస్సులు, అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

మాతృభాషా పరిరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ : తెలుగు మాతృ భాషా పరిరక్షణ మనందరి బాధ్యత అని, గిడుగు రామమూర్తి స్ఫూర్తితో ముందుకు సాగాలని అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పర్తి రాంబాబు అన్నారు. తెలుగు వ్యావహారిక బాషా పితామహుడు గిడుగు రామమూర్తి 160 వ జయంతి,తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఎన్ టీ ఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ప్రజాశక్తి నగర్ లోని చంద్ర రాజేశ్వరావు స్మారక గ్రంధాలయం హాల్‌లో సాహిత్యసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తెలుగు అనే పదంలోనే ఎంతో మాధుర్యం ఉందని తేనెలొలుకు భాష మన తెలుగు భాష అమ్మదనం నిండిన కమ్మనైన భాష తెలుగు అని, మనం ఇంట్లో మాట్లాడే భాష, బడిలో మాట్లాడే భాష రెండూ వేర్వేరుగా ఎందుకు ఉండాలి అని వాడుక భాష లోనే పాఠ్యాంశాలు ఉండాలని గిడుగు ఉద్యమం సాగించారని గుర్తు చేశారు. పురాణ కథలు అయినటువంటి రామాయణ భారతం వంటి వాటిలో ఉన్న గ్రాంథిక భాష నుండి నేడు మనం ఉపయోగిస్తూ ఉన్న వాడుక బాష వ్యాప్తి కోసం గిడుగు విశేష కృషి చేశారని కొనియాడారు. గౌరవ అధ్యక్షులు కొండపల్లి మాధవరావు, ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్ కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి మొదటగా భాష నేర్చుకునేది అమ్మ ఒడిలోనే అని , మాతృ భాష ద్వారానే తనలోని భావాలను వ్యక్త పరచగలరని, మన తెలుగు భాష లోని పద్యాలు, కవితలు, గేయాలు, ఛందస్సు,ఇవన్నీ వాటికవే సాటి అని అన్నారు. ఏపి ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి చంద్ర నాయక్ , ఎస్టీయూ నాయకులు ఎమ్. వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ భాష లందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పరగటి భాను , కొడాలి ఆనందరావు, సాహిత్య మిత్రులు , గ్రంధాలయ పాఠకులు హాజరయ్యారు.

గిడుగు, కందుకూరి, గురజాడల కృషితోనే ఆధునిక సాహిత్యం కాంతివంతం

విశాలాంధ్ర-గుంటూరు : కథయినా కవిత యినా మరే ఇతర రచనైనా సమాజ కళ్యాణానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోపడితేనే దానికి సార్థకత చేకూ రుతుందని రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ, బాపు-రమణ-బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో 'కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం' కార్యక్రమం ఆదివారం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్(ఎస్‌హెచ్‌ఓ) సమావేశమందిరంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రామరాజు మాట్లాడుతూ రచయి తలు, కవులు సాహిత్య సృజనలో తమ ప్రాంత అస్తిత్వాన్ని మర్చిపోకూడద న్నారు. అలాగే భావితరాల భవిష్యత్తుకూ బాటలు వేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన సుప్ర సిద్ధ రచయిత్రి ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయిన కవులే కలకాలం నిలబడ తారని, వారి కవిత్వమే కాలాన్ని గెలిచి నిలబడుతుందని అన్నారు. ఆత్మీయ అతిథి బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య మాట్లాడుతూ గిడుగు రామమూర్తి, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ఈ ముగ్గురు మహానుభావుల కలయికల వెలుగు, ఆ సాహిత్య వైతాళికులు చేసిన కృషి మన తెలుగు నేలను, తెలుగు సాహిత్యాన్ని కాంతివంతం చేసిందన్నారు. ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి రచించిన 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని సుప్రసిద్ధ కథా రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షిస్తూ వెంటనే వెళ్ళి పెనుగొండను చూసొద్దామన్న ఆసక్తిని రేకెత్తించే విధంగా మా పెనుగొండ కథలను రచయిత రాశారన్నారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ నవ్యాంధ్ర రచయితల సంఘంతో కలిసి గిడుగు జయంతిని రెండు రోజుల ముందు జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం గిడుగు జయంతి సందర్భంగా బి.జనార్ధన రెడ్డి నిర్వహించిన కవిసమ్మేళనంలో తెలుగుభాష ప్రాభవాన్ని గుర్తుచేస్తూ పలువురు కవులు తమ కవితల్ని వినిపించారు. 'తెలుగు భాషా ప్రాశస్త్యం' కవితను చదివిన మొరుమూరి శేషాచారికి ఉత్తమకవితా బహుమతిని అందజేశారు నిర్వాహకులు. బండికల్లు జమదగ్ని కార్యక్రమాన్ని ప్రారంభం చేయగా, సయ్యద్ జానీబాషా పర్యవేక్షించారు.

రాజకీయాల కోసం విమర్శలు వద్దు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్ర తరలింపు విషయంపై సమాచారం లేదని ప్రతిపక్షాలు మాట్లాడటం సిగ్గుచేటని వీరులపాడు మండల వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా అన్నారు. శనివారం జుజ్జూరు లో గల ప్రెస్ క్లబ్ నందు వైకాపా ఏర్పాటుచేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల తరలింపు కార్యక్రమం రాత్రికి రాత్రి జరిగినటువంటి విషయం కాదని, మండల మార్పు విషయం క్యాబినెట్లో నిర్ణయం జరిగి, చట్ట ప్రకారం బహిరంగంగా జరిగిన విషయమే గాని చీకటి వ్యవహారం కాదని అన్నారు. జుజ్జూరు సొసైటీ అధ్యక్షులు పూల రాంబాబు మాట్లాడుతూ విమర్శలు అనేవి వాస్తవానికి దగ్గరగా ఉండాలి తప్పిస్తే కేవలం రాజకీయాల కోసమే విమర్శలు చేయటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. జుజ్జూరు గ్రామం మండల కేంద్రంగా మార్పు చెందిందని, గ్రామాభివృద్ధికి మండల కేంద్రాభివృద్ధికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డు తగలటం , రాజకీయాలు చేయటం తగదని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు మండల కేంద్రం జుజ్జూరుకు రావడం సంతోషదాయకమే ఐనా రాజకీయాల కోసమే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.ఈ విషయం మండల ప్రజలు మొత్తం గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ గెజిట్ 396 తో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మాత్రమే మండల కేంద్ర తరలింపు జరిగిందని ఆయన తెలియజేశారు.మండల కేంద్ర తరలింపు విషయమై అన్ని పార్టీల నాయకులకు ఆహ్వాన కమిటీ సమాచారం ఇచ్చిందని ఈ విషయాన్ని పార్టీకి ఆపాదించడం ఏమాత్రం తగదని గ్రామ వైసిపి పార్టీ కన్వీనర్ పూల పుల్లారావు అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమా పత్ రాము, జడ్పీ హైస్కూల్ చైర్మన్ శాంతా, వార్డ్ నెంబర్లు గోపిశెట్టి నరసింహారావు, పరిటాల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేవీ-1లో అదనపు తరగతి గదులు : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ : స్థానిక సత్యనారాయణపురం రైల్వే కాలనీలోని కేంద్రీయ విద్యాలయం నం.1లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎ.నరేంద్రపాటిల్ నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం జరిగిందన్నారు. విజయవాడలో కేంద్ర విద్యాశాఖ నిర్దేశించిన విధంగా సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఆధునిక వసతులతో ఈ భవనాన్ని రూ.7.59 కోట్లు నిర్మించినట్లు తెలిపారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని తదనుగుణంగా విద్యాభ్యాసం చేయాలని విద్యార్థులకు సూచించారు. నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పాఠశాలకు వచ్చివెళ్లేందుకు మరో దారిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఎస్.ఆదిశేషశర్మ మాట్లాడుతూ బాలవాటిక, ప్రైమరీ విద్యార్థులకు మెరుగైన వసతులతో కొత్త భవనం నిర్మాణం జరిగిందన్నారు. 18 తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రైల్వే డీపీఓ బాల మురళీధర్, కేవీ నం.1 వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరావు, కేవీ నం.2 ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకువచ్చినందుకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈతశిక్షణ-ప్రాణరక్షణ-మిద్దెతోటల పోషణ

విశాలాంధ్ర-విజయవాడ : శ్రావణమాసంలో కూడా అకాలపు ఎండలు మండిపోతున్నా,వేకువనే వందలాది పిల్లలు వారి తల్లితండ్రులతో, బంధుమిత్రులతో కృష్ణానదీ తీరాన ప్రకృతిలో పిల్లల కార్యక్రమంలో కూడి కోలాహలం చేశారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, అమరావతి పరిసరప్రాంతాల నుండి చిన్నారులు, తాడేపల్లి వైపు కృష్ణానదీ వారధి క్రింద ఆవారా సంస్థ నిర్వహించిన ప్రకృతి అవగాహన శిబిరంలో ఈతశిక్షణ-ప్రాణరక్షణ మెలుకువలు నదీ జలాల్లో నేర్చుకున్నారు. మహిళా-చిన్నారుల ఈత శిక్షకురాలు శకుంతలాదేవి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో స్విమర్లు సౌజన్య, రమేష్, నరసింహారావు, వైష్ణవి, లౌక్యా, జాషువా, అరవిందా ఉపాధ్యాయులు షారోన్ ఏర్పాట్లు చేశారు.

తీరు మారకుంటే చర్యలు

విశాలాంధ్ర-నందిగామ: నేరస్తులు రౌడీ షీటర్లు తీరు మార్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని నందిగామ సిఐ హనీష్ హెచ్చరించారు. ఆదివారం సీఐ కార్యాలయంలో రౌడీ షీటర్లు సస్పెక్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేరస్తులు కదలికలు ప్రవర్తన తీరుపై టాస్క్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించింది అన్నారు. నేరం చేస్తే ఎంతటి వారైనా తప్పించుకోలేరని గుర్తుంచుకోవాలని సూచించారు.ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొన రాదని ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఎటువంటి పాత్రఉన్న చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. నేర ప్రవృత్తి కలిగిన వారు నడవడిక మార్చుకొని మసులుకోవాలని సిఐ తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తంతో నడుచుకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రౌడీషీట్ తొలగించేందుకు కృషి చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సోమేశ్వరరావు పండుదొరలు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతిని చాటిన తెలుగు వైభవం నృత్య రూపకం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, వేముల చారిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వారోత్సవాలు సందర్భంగా తెలుగు భాషోత్సవం ఆదివారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాలలోని కళావేదికపై జరిగింది. వేదికపై జె ఎం ఎస్ నాట్య వేద అకాడమీ సమర్పణలో జంగం సోదరీమణుల నృత్య దర్శకత్వంలో ప్రదర్శితమైన తెలుగు వైభవం నృత్య రూపకం తెలుగు సంస్కృతిని ప్రతిబింబింప చేసింది. జానపద నృత్య శైలిలో శ్రీకృష్ణదేవరాయల భువన విజయం,గురజాడ,కందుకూరి వంటి సంఘసంస్కర్తలు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చేనేత వంటివృత్తులు,వివాహ విశేషం,కళారూపాలు, పండుగలు, ఆహారపు అలవాట్ల వంటి అంశాలతో ఉత్కృష్టమైన తెలుగుజాతి మనుగడను ప్రేక్షకులకు సాక్షాత్కరింప చేస్తూ నృత్య రూపకం ప్రదర్శితమైంది. 20 మంది చిన్నారులు ప్రదర్శించిన ఈ నృత్య రూపకం అందరి అభినందనలందుకుంది. మాతృభాషని తృణీకరిస్తే మాతృమూర్తిని తిరస్కరించినట్లేనని ప్రముఖులు పేర్కొన్నారు. అదే వేదికపై జరిగిన సభా కార్యక్రమంలో సభాధ్యక్షులుగా ఎపి అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు,ముఖ్యఅతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్,సభా నిర్వహణ వేముల చారిటీస్ చైర్మన్ డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా,వక్తలుగా జెఎంఎస్ నాట్య వేద అధ్యక్షులు జంగం శ్రీనివాస చక్రవర్తి,వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి లు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో మరొక భాష నేర్చుకోవడం తప్పు కాదని,మాతృభాషను విస్మరించడం పొరపాటన్నారు. గ్రాంథికాన్ని సరళీకరించి వ్యవహారిక భాషలో ఉన్న అందాన్ని,పలకడంలో ఉన్న సుఖాన్ని తెలియచెప్పిన భాషోద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని అన్నారు. మాతృభాషతోనే జాతి మనుగడ కొనసాగి సంస్కృతి విరాజిల్లుతుందన్నారు.

హార్మోని ఇకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవసాయ ఉత్పత్తులు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : హార్మోని ఇకోటెక్ ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల విడుదల విడుదల చేశారు. ఆదివారం బందర్ రోడ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో హార్మోని ఇకోటెక్ ప్రవేట్ లిమిటెడ్ ఎండి నరసింహరావు మాట్లాడుతూ అనంతరం మొక్కలకు సహజ సిద్ధమైన మినరల్స్ పోషకాలతో కూడిన ఉత్పత్తులు ఉంటాయన్నారు. సూక్ష్మ పోషకాలు నీటిలో కరిగే ఎరువులు కలుపు మందులు నాశికాల పురుగు మందుల ను విడుదల చేశామన్నారు. చిన్న క్వాంటిటీలో అమెరికా కు ఏగుమతులు చేస్తునైపుణ్యం సంపాదించామన్నారు. రైతుకు అతి తక్కువ లో నాణ్యమైనవి ఇస్తామన్నారు. పరిశోదన కృషితో తయారు చేసిన ప్రొడక్ట్ ను తయారు చేసి మాక్షేత్రంలో పరిశీలించి రైతులకుఇచ్చి తరువాత మాత్రమే మేము మార్కెట్ లోకి తీసుకోస్తామన్నారు.డీలర్స్ వెన్నుముక అని అన్నారు. అనంతరం ఛీఫ్ గెస్ట్ వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ వారి స్లోగన్స్ ప్రకృతే మా మార్గదర్శి,పుడమితల్లే వంటి స్లోగన్ భాగ నచ్చిందన్నారు.వ్యవసాయం దండగా అనే స్టేజి నుండి వ్యవసాయం పండగ అనే స్థితికి వచ్చామన్నారు.భూసార పరిక్షలు,విత్తనం నుండి అమ్మకం వరకు రైతు భరోసా కేంద్రాలతో రైతుకు ఈప్రభుత్వం సేవ చేస్తుందన్నారు.రైతుకు ఆధర్యంగా నిలచి ప్రభుత్వంలో భాగస్వామ్యం నిలవలన్నారు. అనంతరం మొక్కలకు సహజ సిద్ధమైన మినరల్స్ తమ ఉత్పత్తులు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

రూ.50 వేల కోట్లు దాటిన బజాజ్ ఫైనాన్స్ డిపాజిట్లు

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశంలో అగ్రశ్రేణి, వైవిధ్యభరితమైన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకట్కెన, బజాజ్ ఫిన్ సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఫిక్సిడ్ డిపాజిట్ల ఖాతా రూ. 50,000 కోట్ల మైలురాయిని దాటినట్టు ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్‌కు అయిదు లక్షలమందికి పైగా వినియోగదారులు ఉన్నారు. ప్రతి డిపాజిటర్ 2.87 డిపాజిట్లను, మొత్తంగా 14 లక్షల డిపాజిట్లను కలిగి ఉన్నారు. క్రిసిల్, ఐసీఆర్ఏ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ దీర్ఘకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం అత్యున్నతమైన ఏఏఏ/స్టేబుల్ క్రెడిట్ రేటింగ్‌ను బజాజ్ ఫైనాన్స్ కలిగి ఉంది. అలాగే స్వల్పకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం ఎ1జీను, క్రిసిల్, ఐసీఆర్ఏల నుంచి తమ ఫిక్సిడ్ డిపాజిట్ కార్యక్రమం నిమిత్తం ఏఏఏ(స్టేబుల్) రేటింగ్‌ను కలిగి ఉందని ఫిక్సిడ్ డిపాజిట్స్ అండ్ ఏఎంపీటీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సచిన్ సిక్కా తెలిపారు.

ఉదయభానుని కలిసిన జెడ్పీటీసీ నాగమణి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి కమిటీ సభ్యునిగా ఎన్నికైన జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుని పెనుగంచిప్రోలు జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ నాయకులు వూట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, రాష్ట్ర బీసీ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేనికుమారి, సుబ్బాయిగూడెం సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ నరెడ్ల కిషోర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్ నల్లబోతుల వెంకటేశ్, మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లా రఘురామయ్య, నల్లపునేని వెంకటనారాయణ, సుబ్బాయి గూడెం ఎస్సీసెల్ నాయకులు బెజవాడ శ్రీను, మాజీ మండల సమైక్య అధ్యక్షురాలు బొమ్మి రాణి,తదితరులు పాల్గొన్నారు.